కరుణకు ఘననివాళి

సీఎం స్టాలిన్ నేతృత్వంలో మౌన ర్యాలీ ● పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, డీఎంకే శ్రేణులు



కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, ఎంపీలు

ప్యారీస్, ఆగస్టు 7: మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి 6వ వర్ధంతి సందర్భంగా అధికార డీఎంకే ఆధ్వర్యంలో బుధవారం నివాళి, వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మెరీనా బీచ్‌లో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో ఉదయం మౌన ర్యాలీ నిర్వహించారు.ముందుగా అన్నాసాలై ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలోని కరుణానిధి విగ్రహానికి స్టాలిన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి మెరీనా బీచ్‌లోని కరుణానిధి సమాధి వరకు సుమారు 2 కి.మీ మేర స్టాలిన్, రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, ఏవీ వేలు, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, కేఆర్ పెరియకరుప్పన్, ఐ.పెరియస్వామి, తంగం తెన్నరసు, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, టీఆర్ రాజా, వెల్లకోయిల్ స్వామినాధన్, సెంజి మస్తాన్, మనో తంగరాజ్, సీవీ గణేశన్, పార్లమెంటు సభ్యులు కనిమొళి, టీఆర్ బాలు, జగద్రక్షకన్, దయానిధి మారన్, ఎ.రాజా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీనేతలు, వందలాది మంది కార్యకర్తలు మౌన ర్యాలీ చేశారు.. వారు కరుణానిధి సమాధి వద్ద అంజలి ఘటించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీనియర్ నేతలు ఎస్.తిరునావుక్కరసర్, తంగబాలు, ఎం.కృష్ణస్వామి, మైనార్టీ కమిషన్ చైర్మెన్ పీటర్ అల్ఫోన్స్‌జిల్లా అధ్యక్షులు శివరాజశేఖరన్, మాజీ అధ్యక్షుడు అరుంబాక్కం వీరపాండ్యన్ తదితరులు కరుణానిధి సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. గోపాలపురంలో కరుణానిధి నివాసానికి వెళ్లిన స్టాలిన్, డీఎంకే నేత లు కరుణానిధికి పుష్పాంజలి ఘటించారు. అన్నాసాలైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం ప్రాంగణంలోని కరుణ విగ్రహంముందు ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి, అలాగే కోడంబాక్కం మురసోలి ప్రాంగణంలో ఉన్న కలైంజర్ విగ్రహానికి స్టాలిన్ నేతృత్వంలో నివాళులర్పించారు. కలైంజర్ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు డీఎంకే శ్రేణులు నివాళులర్పించడంతో పాటు వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.

13న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

ప్యారీస్, ఆగస్టు 7: ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన ఈ నెల 13వ తేది మంత్రివర్గం సమావేశం జరుగనుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ అమెరికా వెళ్లే ముందు జరుగనున్న మంత్రివర్గ సమావేశం కావడంతో దీనికి ఎనలేని ప్రాధాన్యత నెలకొంది. 2021లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన డీఎంకే ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన స్టాలిన్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మెరుగుపరిచేందుకు పలు చర్యలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ స్థాయికి పెంచేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం వివిధ దేశాల్లో ప్రసిద్ధిచెందిన పెట్టుబడిదారులతో ఒప్పందాలు కుదుర్చుకొనే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా విదేశీ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించేలా నగరంలో ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడులను కూడా నిర్వహించారు. అంతమాత్రమే కాకుండా స్టాలిన్ వివిధ దేశాలకు వెళ్లి పెట్టుబడులకు సంబంధించి విదేశీ ప్రతినిధులతో సమావేశమవుతున్నారు. ఆయన ఇప్పటివరకు జపాన్, సింగపూర్, స్పెయిన్, దుబాయ్ తదితర దేశాల్లో పర్యటించారు. ఈ నేపథ్యంలో, ఈ నెలాఖరులో అమెరికా వెళ్లనున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 13వ తేది ఉదయం 11 గంటలకు సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరుగుతుందని బుధవారం సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.



స్టాలిన్ నేతృత్వంలో నిర్వహించిన మౌన ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, పార్టీ శ్రేణులు

పుదువై ఎల్జీగా కైలాస నాథన్ బాధ్యతల స్వీకరణ



కైలాసనాథన్‌కు స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి రంగస్వామి

పుదుచ్చేరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కైలాసనాథన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రాష్ట్ర ఎల్జీగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు ఆయనను నియమించిన విషయం తెల్సిందే. దీంతో ఆయన మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పుదుచ్చేరి చేరుకున్నారు. ఆయనకు ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం కలిపారు. బుధవారం ఉదయం రాజ్‌భవన్‌లో ఆయన ఎల్జీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత సీఎం, మంత్రులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి క్షమాపణలు చెబితే ఓకే

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, ఆగస్టు 7: బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనతో తమిళులకు సంబంధాలు న్నాయంటూ వ్యాఖ్యానించిన కేసులో కేంద్ర సహాయ మంత్రి శోభా కరందలజే మీడియా ఎదుట బహిరంగ క్షమాపణ చెబితే మన్నిస్తామని రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన కేంద్ర సహాయ మంత్రి శోభా కరందలజే బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన బాంబు దాడి ఘటనకు తమిళులే కారణమని వ్యాఖ్యానించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. ఆమె వ్యాఖ్యలను ముఖ్యమంత్రి స్టాలిన్ సహా పలు రాజకీయ పార్టీల నేతలు ఖండించారు. ఆ తరువాత కేంద్రమంత్రి తన వ్యాఖ్యలకు క్షమాపణలు తెలిపారు.



కేంద్రమంత్రి శోభ కరందలజే

కేసు నమోదు..

తమిళ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన కేంద్ర మంత్రి శోభపై చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి ఫిర్యాదు చేశారు. దీంతో కేంద్రమంత్రి విద్వేష పూరిత వ్యాఖ్యలకు సంబంధించి డీఎంకే చేసి ఫిర్యాదుపై చర్యలు చేపట్టాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం, కేంద్ర సహాయ మంత్రి శోభపై బెంగళూరు పోలీసులు కేసు నమోదుచేశారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా, మతసామరస్యానికి విఘాతం కల్పించేలా మాట్లాడారంటూ ఎన్నికల కమిషన్ ప్రజా ప్రతినిధుల చట్టం 3 విభాగం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి శోభ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జయచంద్రన్ బుధవారం విచారణ జరిపారు. ఆ సమయంలో, శోభా కరందలజే మీడియా సమావేశంలో క్షమాపణలు చెబితే అంగీకరిస్తామని రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది. అయితే విలేఖరుల సమావేశంలో కాకుండా, ప్రమాణ పత్ర రూపంలో క్షమాపణ చెబుతామని శోభ తరపున న్యాయవాది కోర్టుకు వివరించారు. తమిళుల పేరును మీడియా సమావేశంలో ఉచ్చరించినందున, క్షమాపణలు కూడా వారి ముందే చెబితే బావుంటుందని అభిప్రాయపడిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేశారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ కేసులో కాంగ్రెస్ నేత అరెస్టు

మూడు రోజుల విచారణ తర్వాత చర్య

● ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసిన టీఎన్‌సీసీ

అడయార్, ఆగస్టు 7: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో రాష్ట్ర కాంగ్రెస్ యువజన విభాగం కార్యదర్శి అశ్వత్థామను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అతడిని మూడు రోజుల పాటు విచారణ జరిపిన పోలీసులు.. బుధవారం అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఈ విషయం తెలియగానే ఆయన ప్రాథమిక సభ్యత్వంను రద్దు చేసిన టీఎన్‌సీసీ పార్టీ బాధ్యతల నుంచి తొలగించింది. గత యేడాది స్థానిక మడిప్పాక్కంకు చెందిన పేరుమోసిన రౌడీ ఆర్కాడ్ సురేష్ హత్యకు ప్రతీకారంగా ఆర్మ్‌స్ట్రాంగ్‌ను కొందరు రౌడీలు గత నెలలో దారుణంగా హత్య చేసిన విషయం తెల్సిందే. ఈ కేసులో ఇప్పటికే 21 మందిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితుల్లో తిరువేంగడం అనే నిందితుడిని మాత్రం ఎన్‌కౌంటర్ చేశారు. ఈ నేపథ్యంలో హత్య కేసులో 22వ నిందితుడుగా అశ్వత్థామను అరెస్టు చేశారు. తమిళనాడు కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ హత్య కేసు విచారణలో భాగంగా అరెస్టు చేసిన పెన్నై బాలు, అడ్వకేట్ అరుళ్ సహా ముగ్గురిని పలు దఫాలుగా జరిపిన విచారణలో అశ్వత్థామ పేరు వెలుగులోకి వచ్చింది.



ఆర్మ్‌స్ట్రాంగ్ (ఫైల్‌ఫొటో)

రౌడీ నాగేంద్రన్ కుమారుడే...

స్థానిక వ్యాసార్‌పాడికి చెందిన పేరుమోసిన రౌడీ నాగేంద్రన్ కుమారుడే ఈ అశ్వత్థామ. నాగేంద్రన్ వివిధ కేసుల్లో ప్రస్తుతం వేలూరు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు అశ్వత్థామను హత్య కేసులో పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. పైగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ ఆ పార్టీ యువజన విభాగ కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. ఉత్తర చెన్నై ప్రాంతానికి చెందిన అశ్వత్థామను పోలీసులు మూడు రోజుల క్రితమే అదుపులోకి తీసుకున్నారు. అశ్వత్థామకు ఆర్మ్‌స్ట్రాంగ్‌తో చాలాకాలంగా విరోధం ఉంది. ఆవడిలో ఒక భూ సెటిల్‌మెంట్ వ్యవహారంలో వీరిద్దరి మధ్య ఘర్షణ కూడా జరిగింది. అప్పటి నుంచి వీరిద్దరూ ప్రత్యర్థులుగా కొనసాగుతూ వచ్చారు. ఈ పగ కూడా ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు ఓ కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

నిందితుల్లో నాలుగు పార్టీల ప్రముఖులు...

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అరెస్టు చేసిన నిందితుల్లో నాలుగు ప్రధాన పార్టీలకు చెందిన వారుండడం గమనార్హం. అన్నాడీఎంకేకు చెందిన మలర్‌కొడి, బీజేపీకి చెందిన అంజాలై, తమిళ మానిల కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాయవాది హరిహరన్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా కాంగ్రెస్ నాయకుడిని అదుపులోకి తీసుకోవడం గమనార్హం.



షాపింగ్ కాంప్లెక్స్‌లను ప్రారంభిస్తున్న ఉదయనిధి

ట్రిప్లికేన్‌లో రూ.3.41 కోట్లతో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు

● ప్రారంభించిన మంత్రి ఉదయనిధి

అడయార్, ఆగస్టు 7: స్థానిక ట్రిప్లికేన్‌లోని తులసింగ పెరుమాళ్ వీధిలో హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.3.41 కోట్లతో నిర్మించిన రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లను రాష్ట్ర మంత్రి, చెపాక్కం - ట్రిప్లికేన్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉదయనిధి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ మంత్రి వీకే శేఖర్ బాబు, నగర మేయర్ ఆర్.ప్రియ, దక్షిణ చెన్నై ఎంపీ దయానిధి మారన్, దేవాదయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, గత అసెంబ్లీ సమావేశాల్లో దేవాదాయ శాఖ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ట్రిప్లికేన్‌లోని పార్థసారథి దేవస్థానానికి చెందిన, శిథిలావస్థకు చేరుకున్న గృహాలను, షాపులను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తామని ప్రకటించారు. ఇందుకోసం రూ.15 కోట్లను ఖర్చు చేస్తామని వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇపుడు ఈ రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు.

ఇద్దరు మంత్రులకు హైకోర్టు షాక్

● అక్రమార్జన కేసులో కిందికోర్టు తీర్పు రద్దు
● రోజువారీ విచారణకు హాజరు కావాల్సిందేనని స్పష్టీకరణ



తంగం తెన్నరసు



కేకేఎస్ఎస్ రామచంద్రన్

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు సీనియర్ మంత్రులకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెట్టారన్న కేసులో వారిద్దరికీ విముక్తి కల్పిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. పైగా ఈ కేసులో ఆ ఇద్దరు మంత్రులు రోజువారీ విచారణకు హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక, మానవవనరుల అభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్న తంగం తెన్నరసు 2006 నుంచి 2011 వరకు కరుణానిధి ప్రభుత్వంలో పాఠశాల విద్యా శాఖా వమంత్రిగా కొనసాగారు. ఆ సమయంలో ఆయన ఆదాయానికి మించి రూ.76.40 లక్షల మేర ఆస్తులను సంపాదించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనపై 2012లో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసును విచారించిన శ్రీవిల్లిపుత్తూరు ప్రిన్సిపల్ కోర్టు ఈ కేసు నుంచి ఆయన్ని విముక్తుడిని చేస్తూ 2022 సంవత్సరం డిసెంబరు నెలలో తీర్పునిచ్చింది. అదేవిధంగా ప్రస్తుతం రెవెన్యూ శాఖామంత్రిగా ఉన్న సాత్తూరు రామచంద్రన్ 2006-2011 మధ్యకాలంలో బీసీ సంక్షేమ శాఖామంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన రూ.45.56 లక్షల మేరకు ఆదాయానికి మంచి అక్రమాస్తులు సంపాదించారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఆయన భార్య ఆదిలక్ష్మి, మంత్రి స్నేహితుడు కేఎస్‌పీ షణ్ముగమూర్తిపై కూడా ఏసీబీ అధికారులు 2012లో కేసు నమోదు చేశారు. ఈ కేసును కూడా శ్రీవిల్లిపుత్తూరు కోర్టు విచారణ జరిపి, 2022లో కొట్టివేసింది.

సుమోటోగా స్వీకరించిన హైకోర్టు...

అక్రమాస్తుల కేసులో నిందితులందరినీ శ్రీవిల్లిపుత్తూరు కోర్టు విముక్తులను చేయడాన్ని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశన్ సుమోటోగా స్వీకరించారు. ఈ కేసులో ఇద్దరు మంత్రులతో పాటు ఏసీబీ కౌంటర్ దాఖలు చేయాలంటూ నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత మార్చి నుంచి జూన్ వరకు ఈ రెండు కేసులపై న్యాయమూర్తి పలు దఫాలుగా విచారణ జరిపారు. అన్ని వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి.. తుది తీర్పును మాత్రం తేదీ వెల్లడించకుండా వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ బుధవారం కీలక తీర్పును వెలువరించారు. సాత్తూర్ రామచంద్రన్, ఆయన సతీమణి, స్నేహితుడిపై నమోదైన అక్రమాస్తుల కేసులో ఆధారాలు లేవంటూ ఏసీబీ అధికారులు సమర్పించిన నివేదికను న్యాయమూర్తి తప్పుబట్టారు. అంతేగాక శ్రీవిల్లిపుత్తూరు కోర్టు ఈ కేసు నుంచి ఆ ముగ్గురిని విడుదల చేస్తూ ఇచ్చిన తీర్పు కూడా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

9 నుంచి రోజువారీ విచారణ జరపాలి

సాత్తూర్ రామచంద్రన్, ఆదిలక్ష్మి విశాలాక్షి, షణ్ముగమూర్తి ఈ నెల 9వ తేదీ నుంచి రోజువారీ విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. వీరిపై 2011లో నమోదైన అక్రమాస్తుల కేసు విచారణను శ్రీవిల్లిపుత్తూరు ప్రత్యేక కోర్టు రోజువారీగా విచారణ జరిపి, వీలైనంత త్వరగా తుది తీర్పు వెల్లడించాలని ఆదేశించారు. అదేవిధంగా మంత్రి తంగం తెన్నరసుపై నమోదైన కేసును కూడా సరైన ఆధారాలు లేని కారణంగా కింది కోర్టు రద్దుచేసింది. ఈ తీర్పును కొట్టివేస్తున్నట్టు పేర్కొన్నారు. తంగం తెన్నరసుతో పాటు ఆయన భార్య మణిమేఘలై కూడా ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రోజు విచారణకు హాజరు కావాలని, వీరిపై నమోదైన కేసులను రోజువారీగా విచారణ జరిపి తుది తీర్పును వెలువరించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

వలలో పెద్ద చేపలు చిక్కడం లేదు...

సాధారణంగా ఇలాంటి కేసుల్లో పెద్ద చేపలు తప్పించుకుంటున్నాయని ఓ విదేశీ కవి రాసిన కవితను న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ తీర్పు సందర్భంగా ప్రస్తావించారు. ఈ కేసులో హైకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలను కింది కోర్టు దృష్టిలో ఉంచుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

సమాచార ద్వని

పర్యాటక పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 7: పర్యాటక శాఖతో సత్సంబంధాలు కలిగిన పారిశ్రామికులు టూరిజం అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా ప్రతి సంవత్సరం వివిధ అవార్డులను పర్యాటక సంస్థలు, పర్యాటక శాఖకు చెందిన పారిశ్రామికులకు అందజేస్తోంది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20వ తేదిలోపు www.tntourismawards.com అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9444823111, 8667012477 నెంబర్లు సంప్రదించవచ్చు.

సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 7: రాష్ట్ర సహకార శాఖ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, నెట్ వర్క్ అడ్మినిస్ట్రేటర్, ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ స్పెషలిస్ట్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈ, బీటెక్, బీసీఏ ఉత్తీర్ణులైన 25 నుంచి 35 ఏళ్లలోపున్న వారు www.tnscbank.com అనే వెబ్‌సైట్‌లో శుక్రవారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.

వెటర్నరీ కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల

ఐసిఎఫ్, ఆగస్టు 7: రాష్ట్ర పశువైద్య, విజ్ఞాన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన వెటర్నరీ కోర్సుల ర్యాంకుల జాబితా బుధవారం విడుదలైంది. 15 మంది విద్యార్థులు 200లకు 200 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. దివ్య, అభిశ్రీ, సూర్య, అశ్విత, నవీన, సారిక, శ్రీనాథ్, అభిమృతి, అభినయ, బ్రతీక, జాస్మిన్ మోనీషా, మధుమతి, అఖిలన్, గోపినాథ్, కిరణ్ మొదటిస్థానంలో నిలిచారు. ఈ ఏడాది కటాఫ్ మార్కులు పెరిగే అవకాశముంది. ర్యాంకుల జాబితాను adm.tanuvas.ac.in, tanuvas.ac.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఆగస్టు 7: స్థానిక తాంబరం పుదుతాంగల్ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో గురువారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ గ్రీవెన్స్‌లో ఈస్ట్, వెస్ట్ తాంబరం, పెరుంగళత్తూర్, ముడిచ్చూర్, కడప్పేరి నెహ్రూ నగర్, సేలయూరు, చిట్లపాక్కం, మాడంబాక్కం, సెంబాక్కం ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

15 నుంచి సబ్ జూనియర్ హాకీ పోటీలు

ఐసిఎఫ్, ఆగస్టు 7: అంతర్ జిల్లాల సబ్ జూనియర్ పురుషుల హాకీ చాంపియన్ షిప్ పోటీలు రాణిపేటలో ఈ నెల 15 నుంచి 18వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పోటీలకు సంబంధించి తిరువళ్లూర్ జిల్లా సబ్ జూనియర్ హాకీ జట్టు ఎంపిక ఆవడిలో ఉన్న నజరేత్ కళాశాల మైదానంలో 10వ తేది ఉదయం 8 గంటలకు జరుగనుంది. 2008 జనవరి 1వ తేది అనంతరం జన్మించిన వారు ఈ ఎంపికలో పాల్గొనాలని జిల్లా హాకీ నిర్వాహకులు తెలిపారు.

24,25న మురుగన్ మహానాడు

ఐసిఎఫ్, ఆగస్టు 7: దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈ నెల 24,25 తేదీల్లో మహానాడు జరుగనుంది. 'అఖిల లోక ముత్తమిళ్ మురుగన్' పేరుతో జరిగే ఈ మహానాడు నిర్వహించేందుకు ఆరుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటైంది. ఈ కార్యక్రమం నిర్వాహకులుగా దక్షిణ భారత వర్తక సభను ఎంపిక చేయాలని ప్రభుత్వానికి కమిటీ సిఫారసు చేసింది. కమిటీ సిఫారసు మేరకు దేవాదాయ శాఖ కార్యదర్శి చంద్రమోహన్ జీవో విడుదల చేసింది.

రాష్ట్రానికి 6.45 లక్షల మంది విదేశీ పర్యాటకుల రాక

ఐసిఎఫ్, ఆగస్టు 7: రాష్ట్రంలో 6.45 లక్షల మంది విదేశీ పర్యాటకులు సందర్శించినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది 11.74 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలల్లో 6,45,296 మంది వచ్చారని తెలిపారు. అలాగే, గత ఏడాది 28.60 కోట్ల మంది స్వదేశీ పర్యాటకులు విచ్చేయగా, ఈ సంవత్సరం మొదటి అర్థ వార్షికంలో 15.49 కోట్ల మంది వచ్చారన్నారు.

ఫిర్యాదులకు సిప్కాట్ ప్రత్యేక నెంబరు

ఐసిఎఫ్, ఆగస్టు 7: ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి సిప్కాట్ సంస్థ ప్రత్యేక నెంబర్ పరిచయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సిప్కాట్ అనే వృత్తుల అభివృద్ధి సంస్థ 20 జిల్లాల్లో 40 ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటుచేసింది. వాటిలో వివిధ శాఖలకు చెందిన 3,275 సంస్థలు కర్మాగారాలు ఏర్పాటుచేశాయి. ఇవి మినహా 40కి పైగా ప్రాంతాల్లో కొత్త ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటుకానున్నాయి. ఈ నేపథ్యంలో, స్థలాల సేకరణలో ఏర్పడే సమస్యలపై పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు ఫిర్యాదు చేసేందుకు 9894322233 అనే నెంబరును సిప్కాట్ పరిచయం చేసింది. ఈ నెంబరుకు తమ సమస్యల పరిష్కారానికి ప్రజలు కూడా ఫిర్యాదు చేయవచ్చని, దీనికి సంబంధించిన కంట్రోల్ రూమ్ ఎగ్మూర్ సిప్కాట్ కార్యాలయంలో ఉందని అధికారులు తెలిపారు.

15 నుంచి నాగపట్నం-శ్రీలంక మధ్య నౌకా రవాణా

ఐసిఎఫ్, ఆగస్టు 7: చట్టపరమైన సమస్యలు పరిష్కారమై అనుమతి లభించడంతో నాగపట్టణం-శ్రీలంక మధ్య ప్రయాణికుల నౌక ఈ నెల 15వ తేది నుంచి ప్రారంభం కానుంది. నాగపట్టణం హార్బర్ నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు సెరియాపాణి ప్యాసింజర్ నౌక రవాణా 2023 అక్టోబరు 14న ప్రారంభించారు. ఈశాన్య రుతుపవన వర్షాలతో అదే నెల 23వ తేదిన నిలిపివేశారు. ప్రయాణికులు, వర్తకులు ఈ సేవలు మళ్లీ కొనసాగించాలని విజ్ఞప్తి చేయడంతో శివగంగై పేరుతో కొత్త నౌక ఈ సంవత్సరం మే 13వ తేది నుంచి నడుపనున్నట్లు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ ప్రకటించింది. చట్టపరంగా అనుమతి లభించకపోవడంతో ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో, సమస్యలు పరిష్కారమై అనుమతి లభించడంతో శివగంగై ప్యాసింజర్ నౌక చెన్నై నుంచి మంగళవారం సాయంత్రం నాగపట్టణం హార్బర్‌కు చేరుకుంది. ట్రయల్ రన్ నిర్వహించి ఈ నెల 15న నాగపట్టణం నుంచి శ్రీలంకకు నౌక నడుపనున్నట్లు ఆ సంస్థ తెలిపింది.

చెన్నై-ఢాకా మధ్య విమాన సేవల పునరుద్ధరణ

అడయార్, ఆగస్టు 7: బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న ఆందోళనలు, అల్లర్ల కారణంగా నిలిపివేసిన విమాన సేవలు తిరిగి పునరుద్ధరించారు. ఇందులోభాగంగా, చెన్నై - ఢాకా ప్రాంతాల మధ్య నడిచే విమాన సర్వీసులను బుధవారం నుంచి తిరిగి ప్రారంభించారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఢాకా నుంచి చెన్నై వచ్చిన ఇండిగో విమానం, మధ్యాహ్నం 2 గంటలకు బంగ్లా ఎయిర్‌లైన్స్ 2.40 గంటలకు బీభన్ ఎయిర్ లైన్స్‌లకు చెందిన విమానాలు నగరానికి వచ్చాయి. బంగ్లాదేశ్‌లో ఆందోళనల కారణంగా మూడు రోజులుగా ఆ దేశానికి విమాన సర్వీసులు నిలిపివేసిన సంగతి తెలిసిందే.

సరిహద్దు అడవుల్లో పోలీసుల కూంబింగ్


కూంబింగ్‌లో యాంటీ మావోయిస్టు దళాలు

పెరంబూర్, ఆగస్టు 7: తమిళనాడు-కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో యాంటీ మావోయిస్టు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల శరణాలయ పరిధిలో 10 వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలున్నాయి. ఈ ప్రాంతాల చుట్టూ కొండ గ్రామాలు అధికంగా ఉన్నాయి. అదే సమయంలో నీలగిరి జిల్లా అటవీ ప్రాంతం, కర్ణాటక రాష్ట్ర అటవీ ప్రాంతాలను కలిపే ప్రధాన ప్రాంతంగా ఉంది. ఈ నేపథ్యంలో, ఈరోడ్ జిల్లా ఎస్పీ జవహర్ ఉత్తర్వులతో ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ రామ్ ప్రభు నేతృత్వంలో ఈరోడ్ జిల్లా కొండ గ్రామాలు, కర్ణాటక, నీలగిరి సరిహద్దు అటవీ ప్రాంతాల్లో మావోయిస్టు నిరోధక పోలీసులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఎస్టీఎఫ్), అటవీ శాఖతో కలసి ఎత్తికాడు కొండ, కల్వీరన్ ఆలయం, కొంగల్లి అటవీ ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో కొత్త వ్యక్తుల సంచారం, చట్టవిరుద్ధంగా సారా తయారీపై విచారణ చేపట్టారు. కాగా, ఇటీవల వయనాడులో ఏర్పడిన విపత్తు ప్రభావంతో ఆ ప్రాంతంలో ఉన్న మావోయిస్టులు రాష్ట్రంలో ప్రవేశించారనే సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసు వర్గాల సమాచారం.

ప్రభుత్వ శాఖల్లో పెరుగుతున్న కాంట్రాక్ట్ వ్యవస్థ

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్


సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్

పెరంబూర్, ఆగస్టు 7: ప్రభుత్వం, ప్రభుత్వ రంగాల్లో కాంట్రాక్ట్ వ్యవస్థ క్రమక్రమంగా పెరుగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఆరోపించారు. నగరంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 'ప్రైవేటీకరణ-కాంట్రాక్ట్‌లైజేషన్ వ్యతిరేకత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సౌందర్‌రాజన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బాలకృష్ణన్ మాట్లాడుతూ... ఆస్పత్రులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల నియామకాలు కూడా కాంటాక్ట్ పద్ధతిన జరుగుతున్నాయని, అలా, ప్రభుత్వం, ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ వ్యవస్థ క్రమక్రమంగా పెరుగుతోందన్నారు. అన్నింటినీ ప్రైవేటీకరించి, ఉద్యోగులను కాంటాక్ట్ పద్ధతిలో నియమించే చర్యలను కార్మిక సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. సరళీకరణ, ప్రైవేటీకారణ విధానాల కారణంగా గత అన్నాడీఎంకే ప్రభుత్వం గద్దె దిగిందన్నారు. దీని ద్వారా ప్రభుత్వం గుణపాఠం నేర్చుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని బాలకృష్ణన్ సూచించారు.

గూడలూరు కోకల్ సమీపంలో ఇళ్లలో పగుళ్లు

● కేంద్ర భూగర్భ శాఖ నిపుణుల పరిశీలన


పగుళ్లు ఏర్పడిన ఇళ్లను పరిశీలిస్తున్న నిపుణులు

పెరంబూర్, ఆగస్టు 7: గూడలూరు కోకల్ సమీపంలో భూమి, ఇళ్లపై పగుళ్లు ఏర్పడిన ప్రాంతాలను కేంద్ర భూగర్భ శాఖ నిపుణులు బుధవారం పరిశీలించారు. వారు 20 రోజుల పాటు అక్కడ పరిశీలించనున్నారు. నీలగిరి జిల్లా గూడలూరు కొక్కల్ ప్రాంతంలో జూన్ 27,28 తేదీల్లో కురిసిన భారీవర్షాల సమయంలో, 'ఒకటిన్నర సెంట్'గా పిలిచే నివాస ప్రాంతాల్లోని ఇళ్లు, నర్సింగ్ హోమ్ భవనాలు పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. అ పగుళ్లు రోజురోజుకు పెరుగుతుండడంతో, గత వారం కేంద్ర జియాలజీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర భౌగోళిక శాఖకు చెందిన ఇద్దరు అధికారులు బుధవారం చెన్నై నుంచి గూడలూరు చేరుకొని బాధిత ప్రాంతాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూమి, భవనాలకు పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లో 20 రోజులు తనిఖీలు చేపట్టనున్నామని తెలిపారు.

తగ్గిన టమోటా ధరలు

● రోడ్ల పక్కనే వదిలివెళుతున్న రైతులు


రోడ్డుపై పారబోసిన టమోటాలు తింటున్న ఆవు

పెరంబూర్, ఆగస్టు 7: టమోటా ధరలు తగ్గడంతో ఆవేదన చెందుతున్న రైతు లు కాయలు రోడ్ల పక్కనే వదిలి వెళతున్నారు. పళని, నెయికారపట్టి, అయ్యంపాళయం, వాడిపట్టి, తొప్పంబట్టి సహా పరిసర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేస్తున్నారు. టమోటాలను పళని సంతకు తరలిస్తుండగా, రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేస్తుంటారు. గత వారం దిగుబడి తగ్గడంతో టమోటా రూ.100 వరకు విక్రయమైంది. గత వారం ధరలు తగ్గిన నేపథ్యంలో, బుధవారం మరింత తగ్గాయి. 14 కిలోలు కలిగిన పెట్టె రూ.100 నుంచి రూ.200 వరకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఆ ప్రకారం, కిలో టమోటా హోల్‌సేల్ విక్రయాల్లో రూ.8 నుంచి రూ.15 వరకు మాత్రమే పలుకుతోంది. ఈ ధరలకు విక్రయిస్తే పెట్టుబడులు కాదు కదా, కనీసం రవాణా ఖర్చులు కూడా రావని వాపోతున్న రైతులు, సంతకు తీసుకొచ్చిన టమోటాను రోడ్ల పక్కనే పడేసి వెళతున్నారు.

జిల్లా అధ్యక్షులుగా పది మంది మహిళలు

● భావిస్తున్న టీఎన్‌సీసీ

అడయార్, ఆగస్టు 7: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మహిళలను నియమించాలని టీఎన్‌సీసీ భావిస్తుంది. ఇందులో భాగంగా సమర్థులైన పదిమంది మహిళలకు అధ్యక్షులుగా నియమించాలని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో 72 డీసీసీ పదవులుండగా, వీటిలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో ప్రతి రెండు నియోజకవర్గాలను ఒక జిల్లాగా విభజన చేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఆ ప్రకారంగా మొత్తం 117 జిల్లాలుగా చేయనుంది. ఈ జిల్లా అధ్యక్ష పదవులను పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న వారిని గుర్తించి వారికి కీలక బాధ్యతలను అప్పగించాలని భావిస్తుంది. ఇలాంటి వారిలో పది మంది మహిళలకు కూడా అవకాశం కల్పించనున్నారు. తొలిసారి పది జిల్లాలకు అధ్యక్షులుగా మహిళలకు బాధ్యతలు అప్పగించనున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర శాఖలో ఇప్పటివరకు కన్నియాకుమారి జిల్లా డీసీసీగా ఎమ్మెల్యే తారగై మాత్రమే ఉన్నారు. ఇతర మహిళలకు అలాంటి అవకాశం ఇప్పటివరకు లభించలేదు. కానీ, ఈ దఫా డీసీసీల నియామకంలో మహిళలకు ఈ అవకాశం ఇవ్వాలని టీఎన్‌సీసీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం.

బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై పీఎంకే దృష్టి

అడయార్, ఆగస్టు 7: రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పీఎంకే భావిస్తోంది. ఇందుకోసం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీకి అధ్యక్షులతో పాటు కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేసే దిశగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి స్పష్టీకరించారు. ఈ విషయంపై ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ, పార్టీలోని ప్రధాన నేతలకు ఒక్కో నియోజకవర్గ బాధ్యతలను అప్పగించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు కార్యదర్శులు, అధ్యక్షులను నియమించి, పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగాలని సూచించనుందన్నారు. ఇదే విషయంపై ఒక కార్యాచరణ రూపొందిస్తున్నారని 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ఈ చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

కాశీమేడులో జాలరి దారుణహత్య

● శవాన్ని సముద్రంలో విసిరేసిన వైనం

అడయార్, ఆగస్టు 7: స్థానిక కాశీమేడులో ఓ జాలరి దారుణ హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని సముద్ర జలాల్లో విసిరేశారు. బుధవారం పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు... కాశీమేడు ప్రాంతానికి చెందిన ధర్మరాజ్ అనే జాలరి హార్బరులో పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఈయన పదేళ్ళుగా కాశీమేడులోని డిడీర్ నగర్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన తీరంలో నిలిపివుంచిన బోటులో పడుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆ సమయంలో ఆయన మద్యం సేవించి వుండటంతో ఎక్కడైనా నిద్రపోతుంటాడని వారు భావించారు. అయితే, ఆయన ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో చేపలకు వేలం పాట నిర్వహించే మూడో తీరప్రాంతంలో ధర్మరాజ్ మృతదేహాన్ని గుర్తించారు. ఆయన శరీరంపై కత్తిగాట్లు ఉన్నాయి. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, ధర్మరాజ్‌ను హత్య చేసి, మృతదేహాన్ని సముద్రంలో విసిరివేసిన ఉమామహేశ్వర రావుగా గుర్తించి అరెస్టు చేశారు. ధర్మరాజ్‌ను హత్య చేయడానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రమోద్‌కుమార్‌కు డీజీపీగా పదోన్నతి

పెరంబూర్, ఆగస్టు 7: ఐపీఎస్ అధికారి ప్రమోద్‌కుమార్ డీజీపీగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... 1989 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారులకు పదోన్నతులు కల్పించగా, ప్రమోద్‌కుమార్‌పై నమోదైన కేసు విచారణలో ఉంది. కేసు విచారణలో ఉండడంతో ఆ సమయంలో ఆయనకు పదోన్నతి లభించలేదు. ప్రమోద్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలను విచారించిన జాతీయ నిర్వాహక ట్రిబ్యునల్ ఆ ఆరోపణలను రద్దు చేసింది. దీంతో, ప్రమోద్ కుమార్‌కు డీజీపీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రూ.2.80 లక్షల స్వాధీనం

అడయార్, ఆగస్టు 7: కోయంబత్తూరు జిల్లా పెరియనాయకన్ పాళెంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.2.80 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయంలో భూములు, ఇళ్ళు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి నుంచి భారీగా లంచాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులందాయి. ఈ విషయం ఏసీబీ అధికారుల దృష్టికి వెళ్ళింది. దీంతో ఏసీబీ ఏడీఎస్పీ దివ్య సారథ్యంలో ఇన్‌స్పెక్టర్లు షీలా, ఎళిలరసి సిబ్బందితో మంగళవారం రాత్రే పెరియనాయకన్ పాళెం చేరుకుని రాత్రి 7 గంటల నుంచి బుధవారం ఉదయం 7.30 గంటల వరకు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయంలో అక్రమంగా దాచిన రూ.2.80 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ నగదుకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను ప్రశ్నించగా వారు ఎలాంటి సమాధానం చెప్పలేదు.

పరువు నష్టం దావా కేసు

● సభాపతికి కోర్టు సమన్లు

అడయార్, ఆగస్టు 7: ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే న్యాయవాద విభాగం దాఖలు చేసిన పరువు నష్టం కేసులో వచ్చే నెల 9వ తేదీన ప్రత్యక్షంగా హాజరుకావాలంటూ స్పీకర్ అప్పావుకు ప్రజాప్రతినిధుల కోర్టు సమన్లు జారీ చేసింది. గత యేడాది నగరంలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సభాపతి అప్పావు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మృతి తర్వాత అన్నాడీఎంకేకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, కానీ వారిని చేర్చుకునేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ సిద్ధంగా లేరంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకేకు చెందిన పలువురు నేతలు ముక్తకంఠంతో ఖండించారు. అంతేకాకుండా, అన్నాడీఎంకే న్యాయవాద విభాగం సహాయ కార్యదర్శి బాబు మురుగవేల్ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఎస్.అల్లీ.. ఈ పిటిషన్‌ను ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేశారు. దీంతో ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన ఈ కోర్టు.. వచ్చే నెల 9వ తేదీన కోర్టుకు ప్రత్యక్షంగా హాజరుకావాలని స్పీకర్ అప్పావుకు సమన్లు జారీ చేయాలని ఆదేశించింది.

విద్యార్థినికి ఆర్థికసాయం


విద్యార్థినికి చెక్ అందిస్తున్న విజయకుమార్

ప్యారీస్, ఆగస్టు 7: లయన్స్ క్లబ్ సౌత్ సిటీ 324ఎం జిల్లా అధ్యక్షురాలు డా.ఏవీ శివకుమారి నగరంలో ఏవీ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థినికి రూ.16,840 ఆర్థిక సాయం అందించారు. మంగళవారం ఐఏఎస్ అధికారి విజయకుమార్ చేతులు మీదుగా ఈ చెక్‌ను విద్యార్థిని అందుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రాజేశ్వరి, రాణి వెంకటేశన్, కల్యాణి, గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

డెంటల్ ఆస్పత్రి ప్రారంభించిన ఉదయనిధి

ప్యారీస్, ఆగస్టు 7: ఉత్తర చెన్నై రాయపురం నియోజకవర్గంలో రూ. కోటి వ్యయంతో నిర్మించిన డెంటల్ ఆస్పత్రిని మంత్రి ఉదయనిధి బుధవారం ప్రారంభించారు. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి కేటాయించిన రూ.కోటితో ఆధునిక వసతులతో ఉన్న ఈ ఆస్పత్రిలో ఒక దంత వైద్యుడు, ఎక్స్‌రే, స్కాన్ నిపుణులుంటారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు ఈ ఆస్పత్రి పనిచేస్తుంది. ప్రారంభోత్సవంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ జె.గురుపరన్, అడిషినల్ కమిషనర్ విజయచంద్ర భాను రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో రూ.1,120 తగ్గిన బంగారం ధరలు

పెరంబూర్, ఆగస్టు 7: ఆభరణ బంగారం ధర మంగళవారం సవరుకు రూ.560 తగ్గిన నేపథ్యంలో, బుధవారం మరో రూ.560 తగ్గింది. నగరంలో ఒక సవర బంగారం రూ.50,640, ఒక గ్రాము రూ.70 తగ్గి రూ.6,330కి విక్రయమయింది. దీంతో, రెండు రోజుల్లో బంగారు ధర సవరపై రూ.1,120కి తగ్గినట్లయింది. అలాగే, వెండి ధరలో ఎలాంటి మార్పు లేకుండా ఒక కిలో రూ.87 వేలకు విక్రయమైంది.

అవయవ మార్పిడిలో రెండో స్థానం

పెరంబూర్, ఆగస్టు 7: అవయవ మార్పిడిలో తమిళనాడు జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటన మేరకు, తమిళనాడులో 599 అవయవ మార్పిడి చేసి జాతీయ రికార్డు సృష్టించింది. అలాగే, అవయవాల కోసం ఎదురుచూస్తున్న వారికి 178 అవయవాలను విజయవంతంగా అమర్చి మరో రికార్డు సృష్టించింది. దేశంలో అత్యధికంగా గుండె మార్పిడి చేసిన రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందని కేంద్రం తెలిపింది.

మదురైలో 400 మంది పోలీసుల బదిలీ

పెరంబూర్, ఆగస్టు 7: మదురై పోలీసు శాఖలో పనిచేస్తున్న 400 మందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ లోకనాథన్ ఉత్తర్వులు జారీచేశారు. మదురై జిల్లా పరిధిలోని 22 పోలీస్‌స్టేషన్లలో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న పోలీసులు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.

లా కళాశాల విద్యార్థుల ఆందోళన

పెరంబూర్, ఆగస్టు 7: స్థానిక తరమణిలో ఉన్న అంబేద్కర్ న్యాయ కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. జవాబుపత్రాల మూల్యాంకనం సక్రమంగా జరగడం లేదంటూ సుమారు వంద మంది విద్యార్థులు కళాశాల గేటు ముందు బైఠాయించి, యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు, పోలీసులు చర్చలు జరుపుతున్నారు.

అంధకారంలో పాంబన్ బ్రిడ్జి

ఐసిఎఫ్, ఆగస్టు 7: జాతీయ రహదారుల శాఖ రూ.38 లక్షలు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో పాంబన్ రోడ్డు బ్రిడ్జిపై విద్యుత్ బోర్డు కరెంట్ కట్ చేసింది. రామేశ్వరం సమీపంలోని పాంబన్-మండపాన్ని అనుసంధానం చేసేలా సముద్రంలో బ్రిడ్జి నిర్మించారు. వంతెన ఇరువైపులా ఫుట్‌పాత్‌ల్లో 181 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేశారు. పలు నెలలుగా ఈ వీధి దీపాలకు అయ్యే విద్యుత్ బిల్లును జాతీయ రహదారుల శాఖ ఈబీకి చెల్లించలేదు. దీంతో, విద్యుత్ కనెక్షన్ అధికారులు కట్ చేశారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ... 2016 నుంచి ఈ ఏడాది వరకు రూ.38 లక్షలకు పైగా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు.

ఎక్కువ ధరకు విక్రయిస్తామంటూ 10 సవర్ల మోసం

ఐసిఎఫ్, ఆగస్టు 7: ఎక్కువ ధరకు విక్రయిస్తామని నమ్మించి 10 సవర్ల నగలు కాజేసిన సంఘటన పులియాంతోపులో చోటుచేసుకుంది. పులియాంతోపు హైరోడ్డుకు చెందిన హరీస్ అదే ప్రాంతంలో నగల దుకాణం నడుపుతున్నాడు. ఆయనకు బాగా పరిచయమున్న వేళచ్చేరికి చెందిన బల్వంత్‌కోఠారి కూడా నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. బంగారు నగలను అధిక ధరకు విక్రయిస్తానని హరీస్‌ను నమ్మబలికాడు. ఆయన మాటలు నమ్మిన హరీస్ 'హర్చి 22వ తేది బల్వంత్‌కోఠారికి ఉంగరాలు, మంగళసూత్రాలు సహా 10 సవర్ల నగలు అందజేసి, వాటిని విక్రయించాలని కోరాడు. నాలుగు నెలలు అవుతున్నా బల్వంత్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన హరీస్ పులియాంతోపు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

564 మంది వద్ద రూ.45 కోట్లు మోసం

ఐసిఎఫ్, ఆగస్టు 7: ఎక్కువ వడ్డీ ఇస్తామంటూ రూ.45 కోట్లు మోసం చేసిన కేసులో ఫైనాన్స్ సంస్థకు చెందిన ఇద్దరు డైరెక్టర్లను క్రైం విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. పురుషవాక్కంలో 'పురసైవాక్కం చందా సంఘ నిధి లిమిటెడ్' పేరుతో ఫైనాన్స్ సంస్థను నగరానికి చెందిన మోహన్, సుబ్రమణియన్, వెంకట్రామన్ నడుపుతున్నారు. వీరు పెట్టుబడిదారులకు ఎక్కువ వడ్డీ ఇస్తామంటూ 564 మంది వద్ద రూ.45 కోట్ల వరకు మోసానికి పాల్పడ్డారు. ఈ విషయమై బాధితులు అశోక్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు మోహన్, సుబ్రమణియన్‌లను అరెస్ట్ చేసి పరారీలో ఉన్న వెంకట్రామన్ కోసం గాలిస్తున్నారు.

కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో ఖైదీల వస్తువుల విక్రయాలు

ఐసిఎఫ్, ఆగస్టు7:స్థానిక పుళల్ జైలు ఖైదీలు తయారుచేసిన వస్తువుల విక్రయం పోలీసు కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రారంభమైంది. రాష్ట్ర జైళ్లలో ఉన్న ఖైదీలకు వృత్తి శిక్షణఇచ్చి, వారు తయారుచేసే వస్తువులు ప్రత్యేక సంతల ద్వారా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో, చెన్నై కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో మొబైల్ వాహనం ద్వారా పుళల్ సెంట్రల్ జైలు ఖైదీలు తయారుచేసిన వస్తువుల విక్రయాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. లెథర్ బెల్ట్, షూ, రెడీమేడ్ దుస్తులు, కొబ్బరి, శెనగ, నువ్వుల నూనెలు, ఇడ్లీ పొడులు, పచ్చళ్లు, శానిటైజర్లు వంటివి రాయితీ ధరకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల తనిఖీలకు ఉత్తర్వులు

పెరంబూర్, ఆగస్టు 7: రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలవారీ తనిఖీలు చేపట్టాలని ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆస్పత్రుల అల్మారాల్లో వైద్య ఉపకరణాలు తప్ప ఇతర వస్తువులున్నాయా, మరుగుదొడ్ల శుభ్రత, ఇన్, ఔట్ పేషంట్ల విభాగాలు, పడకల వసతి తదితర శాఖాపరమైన తనిఖీలు చేపట్టి, ప్రతినెలా జిల్లాల వారీగా నివేదికలివ్వాలని ఉత్తర్వుల్లో ఆరోగ్యశాఖ పేర్కొంది.

జాగింగ్ చేస్తూ కానిస్టేబుల్ మృతి

పెరంబూర్,ఆగస్టు7:తూత్తుకుడి వల్లనాడు షూటింగ్ రేంజ్‌లో జాగింగ్ చేస్తున్న కానిస్టేబుల్ హఠాత్తుగా స్పృహతప్పి కిందపడి మరణించాడు. తెన్‌కాశి జిల్లా కులశేఖరకోట ప్రాంతానికి చెందిన పొన్‌రాజ్ కుమారుడు పసుపతి మారికి రెండేళ్ల క్రితం మారిసెల్వితో వివాహమైంది. పసుపతి మారి ప్రస్తుతం తూత్తుకుడి జిల్లా వల్లనాడు రైఫిల్ షూటింగ్ కేంద్రంలో కమాండో శిక్షణ పొందుతున్నాడు.ఈనేపథ్యంలో, సోమవారం ఉదయం జాగింగ్ చేస్తున్న ఆయన వల్లనాడు వాటర్‌ట్యాంక్ సమీపంలో హఠాత్తుగా స్పృహతప్పి కిందపడిపోయాడు. వెంటనే సహచర పోలీసులు తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మంగళవారం సాయంత్రం పసుపతి మృతిచెందాడు.ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రౌడీ దురై ఇంట్లో రూ.10 లక్షల స్వాధీనం

పెరంబూర్, ఆగస్టు 7: పుదుకోటలో ఎన్‌కౌంటర్‌కు గురైన రౌడీ దురై ఇంట్లో రూ.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీ దురైకి చెందిన తిరుచ్చి ఇంట్లో తగిన ఆధారాలు లేకుండా రూ.10 లక్షలున్నట్లు ఆదాయపు పన్ను శాఖ పోలీసులకు సమాచారం అందించింది. దీంతో పోలీసులు ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టి రూ.10 నగదు స్వాధీనం చేసుకొని విచారిస్తున్నారు.

గంజాయితో స్కూల్‌కు వచ్చిన ప్లస్‌టూ విద్యార్థి

అడయార్, ఆగస్టు7: స్థానిక పళవన్‌తాంగల్‌లో ప్లస్‌టూ విద్యార్థి గంజాయి ప్యాకెట్‌లో పాఠశాలకు వచ్చాడు. గమనించిన తోటి విద్యార్థులు హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆ విద్యార్థి బ్యాగును తనిఖీ చేసి గంజాయి ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆ విద్యార్థిని హెచ్‌ఎం ప్రశ్నించగా పళవన్‌తాంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి వద్ద గంజాయి ప్యాకెట్ కొనుగోలు చేసినట్టు తెలిపాడు. వెంటనే హెచ్‌ఎం పోలీసుల దృష్టికి తీసుకెళ్ళడంతో విద్యార్థి సహా విద్యార్థి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ గంజాయి ప్యాకెట్ విక్రయించిన కేసులో మడిప్పాక్కంకు చెందిన వైశాక్, దిల్సన్, లోక్ ప్రవీణ్ అనే ముగ్గురిని అరెస్టు చేశారు.

8 మంది రౌడీషీటర్ల అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 7: స్థానిక కోయంబేడు, పులియాంతోపు ప్రాంతాల్లో కత్తులతో బెదిరించి ప్రజల నుంచి నగదు దోచుకున్న 8 మంది రౌడీషీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల కోయంబేడు ప్రాంతానికి చెందిన ఓ హిజ్రా చేయి నరికి నగదు దోచుకున్న ఓ ముఠా పరారైన విషయం తెలిసిందే. హిజ్రా ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు పరారైన ముఠా కోసం గాలించారు. పూందమల్లి హైరోడ్డులోని కోయంబేడు ప్రాంతంలో ఏర్పాటుచేసిన సుమారు 200 సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి నిందితుల ఆచూకీ తెలుసుకున్నారు. వారు ఓ పాడుబడిన భవనంలో తలదాచుకున్నారనే సమాచారంతో పోలీసులు హుటాహుటిన మంగళవారం సాయంత్రం అక్కడకు చేరుకున్నారు. ఇందులో కోయంబేడుకు చెందిన ప్రముఖ రౌడీ గణేష్, అతడి అనుచరులు సూర్య, ఆకాష్, తమిళ్‌వానన్, మణికంఠన్ సహా ఆరుగురిని అరెస్ట్ చేసి ఎగ్మూర్ కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు. అదే విధంగా పులియాంతోపులోని కబేలాకు వెళ్లే వ్యాపారులను బెదిరించి నగదు దోచుకున్న వ్యవహారంలో కోను, అబ్దుల్ అనే ఇద్దరు రౌడీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ రౌడీ ముఠాల నుంచి ఆరు కత్తులు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

బిడ్డ సహా గర్భిణి ఆత్మహత్యాయత్నం

ప్యారీస్, ఆగస్టు 7: కడలూరు మంజకుప్పం ప్రాంతానికి చెందిన జ్ఞానప్రకాశం భార్య అంజుగం కుటుంబ కలహాల కారణంగా ఏడాదిన్నర బిడ్డతో బుధవారం ఉదయం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా, స్థానికులు కాపాడి ఆసుపత్రికి తరలించారు. మద్యానికి బానిసైన జ్ఞానప్రకాశం కుటుంబ పోషణ గురించి ఆలోచించకుండా భార్యతో తరచూ గొడవ పడేవాడు. దీనిపై అంజుగం కడలూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు జ్ఞానప్రకాశాన్ని మందలించి పంపించారు. ఈ నేపథ్యంలో, ఆరు నెలల గర్భిణిగా ఉన్న అంజుగం బుధవారం ఉదయం తన ఏడాదిన్నర కుమార్తెను ఎత్తుకొని కడలూరు అన్నా వంతెన సమీపం చెరువులో దూకింది. ఆ సమయంలో అటు వైపు ర్యాలీగా వెళుతున్న డీఎంకే కార్యకర్తలు తల్లి, బిడ్డను కాపాడి పోలీసులకు అప్పగించారు.

16న అన్నాడీఎంకే కార్యవర్గ అత్యవసర సమావేశం

ప్యారీస్, ఆగస్టు 7: అన్నాడీఎంకే కార్యవర్గ అత్యవసర సమావేశం ఈ నెల 16వ తేదీన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి అధ్యక్షతన జరుగనుంది. అన్నాడీఎంకే బైలా ప్రకారం సంవత్సరంలో ఒకసారి రాష్ట్రస్థాయి కార్యనిర్వాహకులు, రెండు సార్లు కార్యవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఆ రీతిలో రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో 16వ తేది ఉదయం 9.30 గంటలకు జరుగనున్న సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, మహిళా విభాగం, యువజన విభాగం, విద్యార్థి విభాగం, ఆలిండియా ఎంజీఆర్ మండ్రం తదితర అనుబంధ విభాగాల ప్రధాన నిర్వాహకులు తప్పనిసరిగా పాల్గొనాల్సిందిగా పళనిస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం జరుగుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సమావేశాన్ని మరో వారం రోజులకు వాయిదావేయడంతో పార్టీ నిర్వాహకులు నిరాశ చెందారు.

రేపు విడుదల కానున్న 8 చిత్రాలు

చిత్రజ్యోతి

ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఎనిమిది చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో టాప్ స్టార్ ప్రశాంత్ హీరోగా నటించిన 'అంధగన్' ఒకటి.భారీ బడ్జెట్‌తో ప్రధాన తారాగణంతో నిర్మించారు. ఇది బాలీవుడ్ చిత్రానికి రీమేక్ అయినప్పటికీ... దర్శకుడు త్యాగరాజన్ పూర్తిగా మార్చివేసి, తమిళ నేటివిటీకి అనుగుణంగా తెరకెక్కించారు. ప్రశాంత్ సరసన ప్రియా ఆనంద్ హీరోయిన్‌గా నటించగా, సిమ్రాన్, సముద్రఖని, వనిత, కార్తీక్ ఇలా అనేక మంది సీనియర్ నటీనటులు నటించారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఎన్నో ఆశలు నెలకొన్నాయి. పైగా ఈ సినిమా కొత్త అనుభూతి ఇస్తుందని చిత్ర దర్శకుడు త్యాగరాజన్ అంటున్నారు. ఇకపోతే, చిన్న చిత్రాలైన 'గౌండంపాళెయం', 'లైట్ హౌస్', 'మిన్మిణి', 'పి 2 - ఇరువర్', 'పార్క్', 'సూరియనుం - సూరియకాంతియుం', 'వీరాయి మక్కల్' సినిమాలు విడుదలవుతున్నాయి. కాగా, గత శుక్రవారం విడుదలైన చిత్రాల్లో రెండు మూడు మాత్రమే పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతున్నాయి.


'వీరాయి మక్కల్'లో ఓ దృశ్యం

'వడ చెన్నై-2'లో చంద్ర పాత్రలో నటిస్తా

● ఆండ్రియా జెర్మయ్య

'వడ చెన్నై' సినిమాకు సీక్వెలంటూ నిర్మిస్తే చంద్ర పాత్రలో నటించేందుకు సిద్ధంగా ఉన్నట్టు హీరోయిన్ ఆండ్రియా జెర్మయ్య అన్నారు. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన సినీ అవకాశాలపై స్పందించారు. 'ఇపుడు 'మాస్క్' అనే చిత్రంలో హీరో కవిన్‌తో కలిసి నటిస్తున్నాను. ఇటీవలికాలంలో వచ్చిన చిత్రాల్లో ఒక్క పాట కూడా నేను పాడలేదు. త్వరలోనే కొన్ని చిత్రాల్లో పాడతాను. చరిత్ర, పురాణ కథల్లో నటించాలన్న ఆశ, కోరికలు నాకు లేవు. హీరో విజయ్ రాజకీయాల్లోకి రావడాన్ని నేను స్వాగతిస్తున్నాను. కానీ, నాకు మాత్రం ఆ రంగంలోకి రావాలన్న ఆశ లేశమాత్రం కూడా లేదు. చిత్రపరిశ్రమలో నేను ఆశించినట్టుగానే థ్రిల్లర్, హర్రర్, లవ్, కామెడీ ఇలా అన్ని జానర్ చిత్రాల్లో నటించాను. 'వడ చెన్నై'లో చంద్ర పాత్రకు మంచి గుర్తింపుతోపాటు ప్రశంసలు కూడా వచ్చాయి. ఈ సినిమా రెండో భాగాన్ని దర్శకుడు వెట్రిమారన్ తెరకెక్కిస్తే, తిరిగి చంద్ర పాత్రలోనే నటించేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని ఆమె పేర్కొన్నారు.



'స్వీట్ హార్ట్' డబ్బింగ్ షురూ


నటుడు రియోరాజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'స్వీట్ హార్ట్' సినిమా డబ్బింగ్ తాజాగా ప్రారంభించారు. డెబ్యూ డైరెక్టర్ స్వినీత్ ఎస్. సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రియో రాజ్, గోపికా రమేష్, రంజీ పణికర్, రెడిన్ కింగ్‌స్లీ, అరుణాచలం, సురేష్ చక్రవర్తి, తులసి తదితరులు నటిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం. లవ్ ఎంటర్‌టైన్మెంట్‌గా తెరకెక్కించే ఈ చిత్రాన్ని వైఎస్ఆర్ (యువన్ శంకర్ రాజా) ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. తాజాగా డబ్బింగ్‌తో పాటు పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. త్వరలోనే ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాణ సంస్థ రిలీజ్ చేయనుంది.


డబ్బింగ్ స్టూడియోలో రియోరాజ్

గాయకుడిగా అడుగుపెట్టి... దర్శకుడిగా స్థిరపడిన వెంకట్ ప్రభు

● సినీ కెరీర్‌కు 18 యేళ్ళు పూర్తి

చిత్రపరిశ్రమలోకి గాయకుడిగా అడుగుపెట్టిన దర్శకుడు వెంకట్ ప్రభు... ఇపుడు దర్శకుడిగా స్థిరపడి కోలీవుడ్‌లోని అగ్ర దర్శకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆగస్టు 7వ తేదీతో 18 యేళ్ళ సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన సోదరుడు, నటుడు, గాయకుడు ప్రేమ్‌జీ అమరన్ సోషల్ మీడియాలో వెల్లడించారు. ఈ సందర్భంగా తన అన్నకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తమిళ సినీ సంగీత దర్శకుడు, నటుడు, గేయరచయిత, సింగర్ గంగై అమరన్ వారసుడిగా చిత్రపరిశ్రమకు పరిచయమైన వెంకట్ ప్రభు... తొలుత సింగర్‌గా ఎంట్రీ ఇచ్చారు. కొన్ని పాటలు పాడిన తర్వాత పలు చిత్రాల్లో చిన్నచిన్న పాత్రలు పోషించారు. సముద్రఖని దర్శకత్వంలో వచ్చిన 'ఉన్నై శరణడైందేన్' సినిమాలో హీరోగా కూడా నటించారు. అయితే, 2007లో వెంకట్ ప్రభు తెరకెక్కించిన 'చెన్నై 28' సినిమా అనూహ్యంగా ఘన విజయంసాధించింది. ఆ తర్వాత ఆయన 'సరోజ', 'గోవా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఈ సినిమాను నిరాశపరిచినప్పటికీ హీరో అజిత్.. వెంకట్ ప్రభుకు ఓ అవకాశం ఇచ్చారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 2011లో వచ్చిన 'మంగాత్త' సినిమా సూపర్‌హిట్ సాధించింది. ఆ తర్వాత 'బిర్యాని', 'మాసు', 'చెన్నై 28 - పార్ట్', 2021లో 'మానాడు' వంటి చిత్రాలను రూపొందించారు. టాలీవుడ్ హీరో నాగ చైతన్యతో 'కస్టడీ' మూవీని తెరకెక్కించారు. ప్రస్తుతం విజయ్ 68వ చిత్రం 'ది గోట్'ను రూపొందిస్తున్నారు. ఆయన దర్శకుడుగా పనిచేసిన తొలి రోజు 2006 ఆగస్టు 7వ తేదీ. ఈ విషయాన్ని ఆయన సోదరుడు ప్రేమ్‌జీ గుర్తు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ ప్రభుకు పలువురు సినీ ప్రముఖులు విషెస్ చెబుతున్నారు.



కరుణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్



తిరుచ్చిలో కరుణానిధి కాంస్య విగ్రహం

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

అడయార్, ఆగస్టు 7: తిరుచ్చి జిల్లా తిరువెరుంబూరు సమీపంలోని కాట్టూరులో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఆవిష్కరించారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తూత్తుక్కుడి ఎంపీ కనిమొళి, రాష్ట్ర మంత్రులు ఉదయనిధి, కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో బుధవారం ఆ విగ్రహం వద్దకు డీఎంకే శ్రేణులు భారీగా తరలి వచ్చి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

'ఎయిమ్స్' జాప్యానికి ఎడప్పాడి కారణం

● మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆరోపణ

పెరంబూర్, ఆగస్టు 7: కేంద్రప్రభుత్వం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నిధులు పొందకపోవడమే మదురై 'ఎయిమ్స్' ఆసుపత్రి నిర్మాణపనుల్లో జాప్యం జరిగిందని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆరోపించారు. మదురై జిల్లా కల్లంద్రి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.60 లక్షలతో నిర్మించిన ఔట్ పేషంట్ల విభాగాన్ని మంగళవారం మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... మదురై ఎయిమ్స్ నిర్మాణపనులు త్వరగా ప్రారంభించాలని రాష్ట్రప్రభుత్వం తరఫున కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించనున్నామన్నారు. మదురై ఎయిమ్స్ ఆస్పత్రికి మాత్రమే జపాన్ రుణసాయం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే, అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం వ్యతిరేకత తెలిపి ఉండాల్సిందన్నారు. ఎయిమ్స్ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు పొంది ఉంటే ప్రస్తుతం ఆసుపత్రి ప్రజలకు అందుబాటులో ఉండేదన్నారు. మదురై ఆసుపత్రి జాప్యానికి ఎడప్పాడి పళనిస్వామి కారణమన్నారు. అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకు రాష్ట్రంలో పలు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు అనుమతులిచ్చామన్నారు. అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గర్భిణులకు ప్రభుత్వ ఆర్థికసాయాన్ని త్వరలో అందజేయనున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం, ఎమ్మెల్యేలు ఎ.వెంకటేశన్ , ఎమ.భూమినాథన్, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

నేత్రపర్వంగా ఆండాళ్ రథోత్సవం

● శ్రీవిల్లిపుత్తూర్‌లో భక్తుల కోలాహలం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ప్యారీస్, ఆగస్టు 7: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్‌లో ప్రసిద్ధిచెందిన ఆండాళ్ ఆలయంలో ఆడిపూరం సందర్భంగా బుధవారం కన్నుల పండువగా రథోత్సవం జరిగింది. ఈ వైభవంలో వేలా సంఖ్యలో పాల్గొన్న భక్తుల 'గోవింద...గోపాల' దివ్యనామస్మరణతో శ్రీవిల్లిపుత్తూర్ మార్మోగింది. 108 దివ్యదేశాల్లో అతి ప్రాచీనమైనదిగా గుర్తింపు పొందిన శ్రీవిల్లిపుత్తూర్ గోదా దేవి (ఆండాళ్) జన్మస్థలం కావడం విశేషం. ఆడి మాసంలో వచ్చే పూర నక్షత్రం పర్వదినాన ఆండాళ్ జయంతిగా కోలాహలంగా జరుపుకోవడం ఆనవాయితి. ఈ ఏడాది ఆడిపూరం ఉత్సవాలు గత నెల 30న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి మంగళవారం వరకు అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రూపాల్లో అలంకరించి పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన పూరం సందర్భంగా బుధవారం వేకువజాము నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. 4.30 గంటలకు ఆండాళ్, రంగమన్నార్ స్వామివార్లను ఆలయ ప్రాంగణం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలో ఆశీనులను చేశారు. రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం 9 గంటలకు భక్తుల గోవింద నామస్మరణల మధ్య రథం కదిలింది. కాగా, మదురై అళగర్ ఆలయం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ సారెగా సమర్పించారు. రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు భక్తుల సౌకర్యార్థం పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపగా, శ్రీవిల్లిపుత్తూర్ డీఎస్పీ ముఖేష్ జయకుమార్ నేతృత్వంలో సుమారు 2 వేల మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఊటీ కొండ రైలు సేవలు ప్రారంభం



పెరంబూర్, ఆగస్టు 7: మరమ్మతులు పూర్తకావడంతో బుధవారం ఉదయం 7.10 గంటలకు మేట్టుపాళయం నుంచి ఊటీకి కొండ రైలు పర్యాటకులతో బయల్దేరి వెళ్లింది. కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం రైల్వేస్టేషన్ నుంచి నీలగిరి జిల్లా ఊటీకి ప్రతిరోజు ఉదయం 7.10 గంటలకు కొండ రైలు బయల్దేరుతుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ పర్వత రైలులో ప్రయాణిస్తూ నీలగిరి ప్రకృతి అందాలు వీక్షించేందుకు దేశ, విదేశీ పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 1వ తేది భారీవర్షాల కారణంగా హిల్‌గ్రోవ్-అటర్లీ స్టేషన్ల మధ్య రైలు మార్గంపై మట్టిచెరియలు, చెట్లు విరిగిపడ్డాయి. దీంతో, 6వ తేది వరకు కొండ రైలు సేవలు రద్దు చేస్తున్న దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ నేపథ్యంలో, రైలు మార్గంపై పడిన మట్టిచెరియలు, చెట్లు పూర్తిగా తొలగించిన నేపథ్యంలో, బుధవారం నుంచి కొండ రైలు సేవలు యధావిధిగా ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు.

కొన్నిగ్రాముల అనర్హత మీ ప్రేరణ, విజయాలను తగ్గించదు

● ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పెరంబూర్, ఆగస్టు 7: భారత రెజ్లర్ వినేష్ ఫోగట్ అన్ని విభాగాల్లో నిజమైన ఛాంపియన్ అని ముఖ్యమంత్రి స్టాలిన్ కొనియాడారు. మంగళవారం పారీస్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడల్లో మహిళల రెజ్లింగ్ 50 కిలోల ఫ్రీ స్టైల్ విభాగంలో పాల్గొన్న భారత స్టార్ వినేష్ ఫోగట్ (29) ఫైనల్స్ చేరుకున్నారు. అలాగే, పతకాన్ని కూడా గెలిచే అవకాశాలు మెరుగుపరుచుకున్నారు. కానీ, ఈ రోజు బరువు కొలిచే సమయంలో ఆమె 50 కిలోల 100 గ్రాములున్నట్లు నిర్ధారించారు. 50 కిలోల బరువు కంటే ఎక్కువగా ఉండవంతో ఆమెను ఒలింపిక్స్ పోటీలకు అనర్హురాలిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి తన ఎక్స్‌లో... వినేష్ నువ్వు అన్ని విధాలా నిజమైన ఛాంపియన్, మీ బలం, ఫైనల్స్‌కు అద్భుతమైన ప్రయాణం మిలియన్ల మంది భారతీయ కుమార్తెలకు స్ఫూర్తినిచ్చింది. కొన్ని గ్రాముల బరువుతో అనర్హులు కావడం మీ ప్రేరణ, విజయాలను తగ్గించలేరు. మీరు పతకాన్ని కోల్పోయినప్పటికీ, మీరు మీ సంపూర్ణ సంకల్పంతో అందరి హృదయాలు గెలుచుకున్నారు అంటూ సీఎం ట్వీట్ చేశారు.

వినేష్ ఫోగట్ ఎప్పటికీ దేశం గర్వించే కూతురు మంత్రి ఉదయనిధి ట్వీట్

వినేష్ ఫోగట్ ఎప్పటికీ దేశం గర్వించే కూతురు అని మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. ప్యారీస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో మల్లయుద్ధంలో తుదిపోరుకు సిద్ధమైన వినేష్ ఫోగట్ 100 గ్రాములు అధికంగా బరువున్నారంటూ ఆమెను పోటీ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ విషయమై మంత్రి ఉదయనిధి తన ఎక్స్‌లో... వినేష్ ఫోగట్ భారతదేశ ప్రజల హృదయాల్లో ఛాంపియన్‌గా మిగిలిపోతారు. ఈ నిరాశాజనక సమయంలో మేము మీకు అండగా ఉంటాం అంటూ మంత్రి పోస్ట్ చేశారు.

తందై పెరియార్ కళాశాలలో రక్తదాన శిబిరం

వేలూరు, ఆగస్టు 7: స్థానిక తొరప్పాడిలోని తందై పెరియార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం జరిగింది. అడుక్కుమ్‌పారై ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ మేఘల అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ సుబ్బులక్ష్మి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ తహసీల్దార్ కవిత, యూత్ రెడ్‌క్రాస్ పథక అధికారి రాజేష్, ఎన్ఎస్ఎస్ పథక అధికారి రాజ్యలక్ష్మి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు.


అధిక మార్కులు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

అమ్మవారి విగ్రహం నేత్రాల నుంచి కాంతి

● పరవశించిన భక్తులు

పెరంబూర్, ఆగస్టు 7: అమ్మవారి విగ్రహంలో నేత్రాల నుంచి కాంతి వస్తుందనే వార్త దావానలంలా వ్యాపించడంతో భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునల్వేలి జిల్లా దివైయన్‌విలై మెయిన్ బజార్‌లో అర్పుత వినాయకర్ ఆలయం ఉంది. ఈ ఆలయ ప్రాంగణంలో నే ప్రత్యేకంగా అన్నై మూకాంబికై ఆలయం ఉంది. మంగళవారం సాయంత్రం 6.40 గంటలకు ఆలయ పూజారి ముఖేష్ భట్టాచార్యులు మూకాంబికై అమ్మవారికి అలంకరణ చేసేందుకు సామగ్రి సిద్ధం చేస్తున్నారు. ఆ సమయంలో ఆ ప్రాంతానికి చెందిన ముత్తు ఆచారి తన భార్యతో అక్కడకు చేరుకొని, తన భార్య ప్రసవం మంచిగా జరగాలని వేడుకున్నారు. ఆ సమయంలో అమ్మవారి విగ్రహంలోని నేత్రాల నుంచి ఒక విధమైన కాంతి రావడం ముత్తు భార్య గమనించింది. ఈ విషయాన్ని భర్తకు చెప్పడంతో ఆయన ఆ అద్భుత దృశ్యాన్ని చూసి పూజారికి తెలిపాడు. ఈ వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారి నేత్రాల నుంచి కాంతిని గమనించి పులికించిపోయారు. అనంతరం రాత్రి 10 గంటలకు ఆలయాన్ని యధావిధిగా మూసివేశారు. బుధవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరువగా, అప్పటికే అక్కడ భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. కానీ, విగ్రహంలో అమ్మవారి నేత్రాలు సాధారణంగానే ఉండడంతో నిరాశతో వెనుదిరిగారు.


ఆలయంలో బారులు తీరిని భక్తులు

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో



● 16 షట్లర్ల మూసివేత

పెరంబూర్, ఆగస్టు 7: సేలం జిల్లా మేట్టూరు జలాశయానికి ఇన్‌ఫ్లో పదివేల ఘనపుటడుగులకు తగ్గింది. ఈ డ్యాం గత నెల 30వ తేది 120 అడుగుల పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. దీంతో, డ్యాం భద్రత దృష్ట్యా 16 గేట్లు తెరచి అదనపు జలాలు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, కావేరి తీరప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడం, కర్ణాటక డ్యాంల నుంచి నీటి విడుదల తగ్గించడంతో మంగళవారం సాయంత్రం డ్యాంకు 20,000 ఘనపుటడుగులుగా వస్తున్న నీటి రాక బుధవారం ఉదయానికి 10,000 ఘనపుటడుగులకు తగ్గింది. దీంతో, అదనపు జలాలు విడుదల చేస్తున్న 16 షట్లర్లు మూసివేశారు. ప్రస్తుతం డ్యాంలో 120 అడుగులు (93.47 టీఎంసీలు) నీటిమట్టాలుండగా, డెల్టా సాగుకు రూ.10వేల ఘనపుటడుగులు, తూర్పు, పశ్చిమ కాలువలకు తలా 500 ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత

● బీజేపీ నేత నారాయణ తిరుపతి

వేలూరు, ఆగస్టు 7: కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు ప్రాధాన్యత ఇచ్చారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ తిరుపతి తెలిపారు. నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలోని అన్ని శాఖలకు పది శాతం కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన విమాన శాఖ, నీటి శాఖ, రహదారుల అభివృద్ధి, రైల్వే సహా పలు పథకాల్లో కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం ఉందన్నారు. కానీ, రాష్ట్రానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదంటూ డీఎంకే ఆరోపించడం సరికాదన్నారు. రాష్ట్రంలో సంఘ విద్రోహులు పెరిగిపోతున్నారని, అలాంటి వారు ఏ పార్టీలో ఉన్నా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్‌పై కోర్టు వేసిన కేసులు తిరిగి విచారించాలనే హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎవరూ తప్పు చేసినా శిక్ష పడాల్సిందేనని అన్నారు. ఈ కేసుల విచారణ సత్వరం పూర్తిచేసి తీర్పు వెలువరించాలని నారాయణ తిరుపతి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ తిరుపతి

11న నడిగర్ సంఘ సమావేశం

అడయార్,ఆగస్టు7: ఈ నెల 11వ తేదీ నడిగర్ సంఘ సమావేశం జరుగనుంది. ఇందులో ఆ సంఘ అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులంతా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో హీరోలు కమల్ హాసన్, ధనుష్, విశాల్, శింబులపై తమిళ సినీ నిర్మాతల మండలి విధించిన ఆంక్షలతో పాటు సినిమా షూటింగుల నిలిపివేసే అంశం, ఇతర నిబంధనలపై చర్చించనున్నారు. కాగా, ఇటీవల నిర్మాతల మండలి సారథ్యంలోని వివిధ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ కమిటీ పలు ఆంక్షలు విధించడంతో పాటు పలువురు హీరోలతో సినిమాలు నిర్మించవద్దని నిర్మాతలను కోరిన విషయం తెల్సిందే. ఈ తీర్మానం పెను వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన జరిగే నడిగర్ సంఘ సమావేశానికి ప్రాధాన్యత నెలకొంది.

నేడు నగరానికి విశ్వప్రసన్న స్వామి

అడయార్, ఆగస్టు 7: స్థానిక అయనావరంలోని రాఘవేంద్ర స్వామి బృందావనానికి పేజావర్ స్థపతి విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ గురువారం రానున్నారు. అయోధ్య మందిరంలో శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఆయన రాఘవేంద్ర బృందావనంలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులకు ఆశీర్వాదం ఇస్తారు. బృందావనానికి వచ్చే తీర్థ స్వామికి మంగళవాయిద్యాలు, పూర్ణ కుంభాలతో ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత పాద పూజ, అనుగ్రహ పాషాణం, నామ సంకీర్తన, స్తోత్ర పారాయణం, సంస్థాన పూజ తదితర ప్రత్యేక పూజలు, పారాయణాలు నిర్వహించనున్నారు. ఈ పూజల్లో భక్తులంతా పాల్గొనవచ్చని బృందావనం నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఈ బృందావనం నిర్మించేందుకు 1980లో భూమిపూజ చేసిన వారిలో ఈయన ఒకరు కావడం గమనార్హం.